క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

చొప్పదండి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థులకు శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అశ్విత విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, సీహెచ్‌వో ప్రసాద్, రాకేశ్, పద్మ, వసంత, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రాసన, అక్షరాభ్యాసం

సైదాపూర్: మండలంలోని జాగీర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. గర్భిణులు, బాలింతలకు, కిశోరబాలికలకు పౌష్టికాహారం, పరిశుభ్రత, భద్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టిక ఆహారం సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ కాంతమ్మ, ఎంపీటీసీ ఓదెలు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్లవేని శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ రమ,జ్యోతి, ఏఎన్ఎం రాజమ్మ పాల్గొన్నారు.

రూ. 30 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎస్సై తిరుపతి

రామడుగు: మండల కేంద్రంలోని నిరుపేద గీతకార్మిక కుటుంబానికి చెందిన యువతి వివాహానికి రుద్రారం ఎంపీటీసీ గుర్రం దేవిక రాజశేఖర్ దాతల సహకారంతో రూ.30 వేలు జమచేశారు. ఈమేరకు నగదును శనివారం ఎస్సై తోట తిరుపతి చేతుల మీదుగా యువతి కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం సర్పంచ్ శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ



గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తున్న జీవీఆర్

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో యాదవులకు శనివారం సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జీవీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రతి కులానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. 12 యూనిట్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో ఎల్లయ, మహేశ్, కనుక్య, శ్రీనివాస్, ఐలయ్య, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

చొప్పదండి: రసాయనాలను ఉపయోగించడంతో సాగు ఖర్చులు పెరిగి, ఆహార పదార్థాలు కలుషితమై, రైతులు నష్ట పోతున్న తరుణంలో సేంద్రియ వ్యవసాయమే పరిష్కారమని జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మావురం మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద కూర్మపల్లిలో శనివారం రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు, పంట ఉత్పత్తులకు విలువ జోడింపు అంశంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. విత్తనాలను రైతులు క్షేత్రాల్లోనే తయారు చేసుకోవాలని, తయారీ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లడంతో చీడపీడల ప్రభావం పెరిగిపోయిందన్నారు. సమస్యలన్నింటికీ పరిష్కారం సేంద్రియ సాగే అన్నారు. అనంతరం మల్లికార్జున్‌రెడ్డి చేస్తున్న సేంద్రియ సాగు పద్ధతులను రైతులు పరిశీలించారు. ఏఈవో యాదగిరి శ్రీనివాస్, ఈడీఎం శ్రీరామ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ ప్రసాద్, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో మృతిచెందిన కాపర్తి కొమురయ్య కుటుంబాన్ని శనివారం ఆటోడ్రైవర్లు పరామర్శించి యాభై కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు సదానందం, సమ్మయ్య, సంపత్, శ్రీనివాస్, చారి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. చేరువలో

- కొత్తశోభ సంతరించుకోనున్న మానకొండూర్ చెరువు
- మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు నిధుల కొరత
- రూ. రెండు కోట్ల నిధులు కేటాయించిన 'సుడా'
- ముమ్మరంగా సాగుతున్న బ్యూటిఫికేషన్ పనులు



చెరువు కట్టపై ముఖద్వారం పనులు



కట్టపై విఠలేశ్వరస్వామి ఆలయం చుట్టూ రెయిలింగ్ పనులు

మానకొండూర్: చెరువులు, కుంటలు అంటే ఒకప్పుడు భయం ఉండేది. ముళ్లపొదలు, పాములు, పుట్టలతో ఉంటాయనే ఆందోళన మదిలో కలిగేది. అలాంటి వాతావరణానికి భిన్నంగా మానకొండూర్ చెరువుకట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దే పనులు సుడా నిధులతో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులు పూర్తయితే మానకొండూర్ చెరువు కొత్త సొబగులు సంతరించుకోనుంది. మినీ ట్యాంకుబండ్‌గా మార్చేందుకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలినాళ్లలో శిలాఫలకం వేశారు. సుమారు రూ.5.62 లక్షలతో పనులు చేపట్టారు. చెరువుకట్ట ఎత్తు, వెడల్పు పెంచడం, రెయిలింగ్ ఏర్పాటుతోపాటు చెరువులో మట్టి తీయడం, తూములు, తెట్టె పేర్చడం, చిల్డ్రన్ పార్క్ పనులు చేపట్టారు. ఈనిధులతో పనులు పూర్తి కాలేదు. అసంపూర్తి పనులు వెక్కిరిస్తున్న తరుణంలో సుడా నిధులతో మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి.

ఊపందుకున్న పనులు

చెరువుకట్ట పనులు అసంపూర్తిగా ఉండటంతో సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించారు. చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు సుడా నిధులు రూ. రెండు కోట్లు వెచ్చించారు. ఇప్పుడిప్పుడే పనులు ఊపందుకున్నాయి. చెరువుకట్టపై విఠలేశ్వరస్వామిని భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఆలయం చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్నారు. టైల్స్, పచ్చనిగడ్డి, సిమెంటు దిమ్మెల ఏర్పాటు, చెరువుకట్ట ముఖద్వార పనులు చేపట్టారు. చెరువుకట్టపై రెయిలింగ్ పనులు పూర్తి చేసేందుకు ఆరునెలల అగ్రిమెంటు ఉన్నా త్వరగా పూర్తి చేసేందుకు పనుల్లో వేగం పెంచారు.

నగరవాసులకు చేరువగా..

కరీంనగర్ నగరంలో నెలకొల్పిన వినాయక విగ్రహాలు, బతుకమ్మలను మానకొండూర్ చెరువులో 15 సంవత్సరాలుగా నిమజ్జన చేస్తున్నారు. రెండు పండుగల వేళ కరీంనగర్ పట్టణవాసులు ఇక్కడకు వచ్చి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఆనందంగా గడుపుతారు. ప్రస్తుతం మానేరువాగుపై నిర్మించిన తీగల వంతెనతో మానకొండూర్ చెరువు మరింత చేరువ అయ్యింది. దీంతో పట్టణవాసులు ఇక్కడకు వచ్చి ప్రకృతిని ఆస్వాదించే అవకాశం లేక పోలేదు.

బ్యూటిఫికేషన్‌తో ఆహ్లాదం

సుడా నిధులతో చేపట్టనున్న బ్యూటిఫికేషన్ పనులతో మానకొండూర్ చెరువు ఆహ్లాదకరంగా మారనుంది. రహదారి పక్కనే చెరువు, నిండుగా నీరు, చెరువుకట్ట కిందివైపు పంట పొలాలు, కట్టపై బ్యూటిఫికేషన్ పనులు ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచనున్నాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.



మానకొండూర్ చెరువు కట్ట

పనుల పరిశీలన



చెరువు సుందరీకరణ పనులను సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు శనివారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వెంట జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఉపసర్పంచ్ నెల్లి మురళి, నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రం కిరణ్‌గౌడ్ ఉన్నారు.

విజ్ఞాన మేళాలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు విజ్ఞాన మేళాలో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 7, 8వ తేదీల్లో సిద్దిపేటలో (కరీంనగర్, సిద్దిపేట్, జగత్యాల్, సిరిసిల్ల)విభాగ్ స్థాయి విజ్ఞాన మేళాలో పాల్గొని విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలకు చెందిన కదార్ల ఆరాధ్య, కనుమల సాత్విక్ ప్రథమ, సాయిసాద్విని, వర్ణిక, శ్వేజన్, శ్రీరామన్ ద్వితీయ స్థాయిలో బహుమతులు పొందారు. విద్యార్థులు, ప్రోత్సహించిన విజ్ఞాన మేళా ప్రముఖ్ సౌందర్య, రవి, హెచ్‌ఎం గుడికందుల సుదర్శన్, విద్యాపీటం జిల్లా కార్యదర్శి తెల్ల రాజమౌళి, టీచర్స్ బృందాన్ని పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

మొలుగూరి సదయ్యకు ప్రశంసాపత్రం అందజేత

జమ్మికుంట: టీపీసీసీ హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లా, బ్లాక్, మండల అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పట్టణానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి గుర్తింపుగా ప్రశంసాపత్రం అందజేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారని సదయ్య తెలిపారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

హుజూరాబాద్: పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శి పాక సతీశ్ మాట్లాడుతూ... కాళోజీ ప్రజల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాళోజీ హక్కులు అడిగిన ప్రజల మనిషి, ఉద్యమం నడిపిన ప్రజావాది అని పేర్కొన్నారు. రిటైర్డ్ ఎంఈవోలు ఇలాసాగరం వీరస్వామి, రాంపల్లి రాజయ్య, రిటైర్డ్ హౌసింగ్ బోర్డ్ ఏఈ మునీర్, రిటైర్డ్ హెచ్‌ఎం ఇనగల సూర్యనారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు బొరగాల రాజయ్య, తిరునగరి రమేశ్, గంగిశెట్టి జగదీశ్వర్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: తెలుగు భాషా పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్‌డిగ్రీ కళాశాలలో శనివారం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ .హనుమకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: నివాళి అర్పిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్లో కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థుల నృత్యాలు, ఉపన్యాసాలు అలరించాయి. అంతకు ముందు తెలంగాణ భాషా ప్రాముఖ్యత అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు పాఠశాల సమన్వయకర్త ఆర్.నాగరాజు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు విద్యార్థులకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ వీయూఎం ప్రసాద్, హెచ్‌ఆర్ డైరెక్టర్ ప్రసూన, ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్, తెలుగు టీచర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: పారమితలో..

ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: చొప్పదండి ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదిస్తే అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గర్శకుర్తి గ్రామంలోని విజయనగర్‌కాలనీలోని వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాకి శనివారం హాజరయ్యారు. ఈ సంధర్బంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఉత్సవ కమిటీ సభ్యుల వినతిమేరకు ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.పదిలక్షలు మంజూరు చేశారు. కేవలం ఎన్నికల సమయంలో వచ్చిపోయే నాయకుడిని కాదని ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేసే వాడినన్నారు. స్వరాష్ట్రంలో ఇంటింటికీ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల వెంకన్నగౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కింద పడిపోయాడు. బాధితుడికి మంజూరైన రూ. ఐదులక్షల చెక్కును బూర్గుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అందజేశారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గన్నేరువరం, చొక్కారావుపల్లెలో ఎమ్మెల్యే పర్యటన



గన్నేరువరంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యాదవ సంఘం సభ్యులు

గన్నేరువరం: దళితులు, యాదవులు ఆత్మగౌరవంతో బతకాలన్నదే సీఎం కేసీఆర్ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని చొక్కారావుపల్లెలో శనివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో యాదవ సంఘం సభ్యులు, గొల్ల కురుమలతో సమావేశమయ్యారు. అర్హులైన వారికి గృహలక్ష్మి పథకం అందించనున్నామని, చొక్కారావుపల్లెలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం దళితబంధు ప్రవేశపెట్టిందని, మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గొల్ల కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రెండో విడత గొర్రెల పంపిణీ త్వరలో చేపడతామని, పూర్తి స్థాయిలో పశువైద్యాధికారిని నియమించి, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల మాటలు నమ్మిమోసపోవద్దన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, సహకార సంఘం మాజీ చైర్మన్ అలువాల కోటి, ఆర్ఎస్ఎస్ మండల కోఆర్డినేటర్ బద్దం తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, నాయకులు పుల్లెల లక్ష్మణ్, జువ్వాడి మన్మోహన్‌రావు, న్యాత సుధాకర్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు సందవేని ప్రశాంత్, సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

విగ్రహ ప్రతిష్ఠాపన

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య హోమం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, వంగాల శ్రీనివాస్ రెడ్డి, నూనె సురేష్, సంజీవరెడ్డి, ఎన్నం బాల్ రెడ్డి, ఇనుకొండ రాజిరెడ్డి, పడాల రామస్వామి, గట్టయ్య యాదవ్, నరసయ్య యాదవ్, రమణాచారి, రవీంద్ర చారి, బ్రహ్మచారి, అంజిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి,రమేశ్, పద్మ, రంజిత్, సంపత్, అంజయ్య గ్రామస్తులు పాల్గొన్నారు. ఆదివారం బోనాల జాతరకు ఏర్పాట్లు చేశామని సర్పంచ్ తెలిపారు.



తిమ్మాపూర్: హోమంలో పాల్గొన్న సర్పంచ్ రావుల రమేశ్

భక్తులకు ప్రసాదం పంపిణీ

మానకొండూర్: శ్రావణ శనివారం పురస్కరించుకుని మండలంలోని అన్నారం వరగట్టు ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం హనుమాన్ దీక్షా సమితి సభ్యులు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దీక్షా సమితి సభ్యులు డాక్టర్ సుధాకర్, రేగుల కుమారస్వామి, పడకంటి వీరేశం, కొమ్ము రాజు, రొడ్డ సుదాకర్, మెట్టు ప్రణయ్, దబ్బాసి అనిల్, దాడి సమ్మయ్య, ఆలయ కమిటీ చైర్మన్ పోతర్ల అంజయ్య పాల్గొన్నారు.



మానకొండూర్: ప్రసాదం పంపిణీ చేస్తున్న హనుమాన్ దీక్షా సమితి సభ్యులు

నియామకం



నియామకపత్రం అందిస్తున్న వినయ్

తిమ్మాపూర్: యూత్ కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ కార్యదర్శిగా మండలంలోని మొగిలిపాలెం గ్రామానికి చెందిన సముద్రాల అనిల్ నియామకమయ్యారు. ఈమేరకు శనివారం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్, ప్రధాన కార్యదర్శి బోయిని కృష్ణబాబుకు అనిల్ ధన్యవాదాలు తెలిపారు.గొప్ప అవకాశం కల్పించిన పార్టీకి రుణపడి ఉంటానని కాంగ్రెస్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో మానకొండూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడిగా ఇంగ్లే రామారావును నియమించినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ అభ్యున్నతికి, పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా అహర్నిశలు కృషిచేస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలతో పనిచేస్తానని రామారావు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించడానికి కృషి చేసిన హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు



దరఖాస్తు సమర్పిస్తున్న అజయ్‌వర్మ



దరఖాస్తు సమర్పిస్తున్న శంకర్

గన్నేరువరం: మానకొండూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు, ఖాసీంపేటకు చెందిన నగునూరి శంకర్, గునుకులకొండాపూర్ మాజీ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ దరఖాస్తులు సమర్పించామని తెలిపారు. బీజేపీతో రాజకీయ జీవితం ప్రారంభించి, రెండు దశాబ్దాలుగా నమ్మిన సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నందుకు అవకాశం కల్పించాలని శంకర్, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందుకు అవకాశం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ అనుచరుడు సొల్లు అజయ్‌వర్మ కోరారు.

కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్ రోడ్డులో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రారంభించి యూత్ సభ్యులను ఉత్సాహపరిచారు. ఉట్టి కొట్టే వేడుకలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముక్క రమేశ్, మొలుగు సృజనపూర్ణచందర్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పైళ్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు పోరెడ్డి శంతన్‌రెడ్డి, శ్రీకృష్ణ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



గోపాల్‌రావుపేటలో తీజ్ వేడుకలు



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రగతి హైస్కూల్ ఆవరణలో శనివారం గిరిజనుల ప్రత్యేక పర్వదినం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతుల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాదాక్రిష్ణ, ప్రిన్సిపాల్ ఆలె వెంకటనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్: రాజశేఖర్ - 9618304759
చొప్పదండి: ముండయ్య - 7997958217
మానకొండూర్: మహేశ్ - 9573106760
హుజూరాబాద్: ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899